Cell: 9440352036

మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143



WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774



Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 103 | Saturday 22.03.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 103 | శనివారం 22. 03. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4


### కశ్మీర్‌లో ఇప్పుడు సాధారణ పరిస్థితులు...

## నెలకొన్నాయి

### : కేంద్ర హెూం మంత్రి

ఉగ్రవాదం పట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్నాం: అమిత్ షా

యువత ఉద్యోగాలు చేసుకుంటోంది, సినిమా హాళ్లు నిండుతున్నాయని వ్యాఖ్య

గత ప్రభుత్వాలు ఉగ్రవాదం పట్ల మెతకవైఖరిని అనుసరించాయని ఆరోపణ



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కశ్మీర్‌లో ప్రస్తుతం సాధారణ పరిస్థితులు

మిగతా 2 లో

### వేంకటేశ్వరస్వామి ఆస్తులు ఎవరు కబ్జా చేసినా వాటిని తిరిగి...

# దేవుడికే చెందేలా చేస్తాం



ఆ వేంకటేశ్వరుడి ప్రాణభిక్షతోనే బతికున్నా : సీఎం

నారా దేవాన్ష్ పుట్టినరోజు

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

అన్న ప్రసాద కేంద్రంలో ప్రసాదాల వితరణ

24 క్లేమోర్స్ పేలినా బతికున్నానంటే వేంకటేశ్వరస్వామి భిక్షతోనేనన్న ముఖ్యమంత్రి

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : సీఎం చంద్రబాబు నాయుడు తన మనవడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు వెంగమాంబ అన్నవితరణ కేంద్రంలో అన్నప్రసాదం స్వయంగా వడ్డించారు. అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు లేవు. ఆయా గ్రామాల్లో వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం నిధులు సేకరించేందుకు ట్రస్టు ఏర్పాటు చేస్తాం. నాడు ఎన్టీఆర్ అన్నదానం, నేను ప్రాణదానం కార్యక్రమాలు ప్రవేశపెట్టాం. మూడవ కార్యక్రమంగా ఆలయాల నిర్మాణాలను తలపెడుతున్నాం. మాధవ సేవ కోసమే ఆలయాల నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. ట్రస్ట్‌కు వచ్చే నిధులు పగడ్బందీగా ఖర్చు చేస్తాం. వేంకటేశ్వరస్వామి ఆస్తులు ఎవరు కబ్జా చేసినా వాటిని తిరిగి దేవుడికే చెందేలా చేస్తాం" అని చంద్రబాబు అన్నారు.

**వేంకటేశ్వరుడి ప్రాణభిక్షతోనే బతికున్నా...**

దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నామని చంద్రబాబు తెలిపారు. ప్రతి పుట్టిన రోజు నాడు తిరుమలలో అన్నదానం చేయడం ఆనవాయతీగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారన్నారు. ఇప్పటికి విరాళాల ద్వారా రూ. 2,200 కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటైందని, అన్నదానం ఒక మహత్తర కార్యక్రమమని సీఎం అభివర్ణించారు. ఇది శాశ్వతంగా జరుగుతుందన్నారు. తాను

మిగతా 2 లో

### పోసానికి...

## ఊరట...

సీఐడీ కేసులో బెయిల్ మంజూరు

పోసానికి బెయిల్ మంజూరు చేసిన గుంటూరు కోర్టు

ఏపీలో పోసానిపై 19 కేసులు

కూటమి ప్రభుత్వం వచ్చాక పోసానికి తిప్పలు!



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : ప్రముఖ సినీ నటు డు పోసాని కృష్ణమురళికి ఊరట కలిగింది. గుంటూరు కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. సీఐడీ నమోదు చేసిన కేసులో పోసానికి బెయిల్ లభించింది. పోసాని బెయిల్ పిటిషన్‌పై గుంటూరు కోర్టు బుధవారం విచారణ జరిపి తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది. తిరిగి నేడు విచారణ జరిపి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పోసాని,

మిగతా 2 లో

### మంత్రి ఫరూఖ్‌కు...

## భార్యావియోగం...

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రబాబు, పవన్, లోకేశ్

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మంత్రి ఫరూఖ్ భార్య

హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స

ఈ ఉదయం కన్నుమూత- సంతాపం తెలిపిన కూటమి పెద్దలు

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : ఏపీ మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ కు భార్యావియోగం కలిగింది. ఆయన భార్య షహనాజ్ హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ నేపథ్యంలో, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర

మిగతా 2 లో



### సంస్కారానికి ఆస్కార్ అవార్డు ఉంటే అది...

## రేవంత్ రెడ్డికే ఇవ్వాలి

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : సంస్కారానికి ఆస్కార్ అవార్డు ఉంటే అది రేవంత్ రెడ్డికే ఇవ్వాలి అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేశారు. శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క కలిసి నిర్మించిన గాలి మేడ ఈ బడ్జెట్. ఎన్నికల ముందు పాతాళ భైరవి నరుడా ఏమి నీ కోరిక..? ఎన్నికల తర్వాత పాపాల భైరవి. నన్నేం అడుగకు, నాకేం తెల్వది. డిసెంబరు 9, 2023 వరకు అమలు చేస్తామన్న వాగ్దానాలు అమలుకావడానికి ప్రజలు ఇంకా ఎన్ని డిసెంబర్లు ఎదురు చూడాలో. రావాల్సిన డిసెంబరు అసలు వస్తుందో రాదో అనే అనుమానాలు ముసురుకున్నాయి. ఊకదంపుడు ఉపన్యాసాలు, ఉత్తర కుమార

మిగతా 2 లో



### ప్రజల నుంచి అభిప్రాయం తీసుకుని...

## ప్లాన్ అమలుచేస్తాం

### మంత్రి నారాయణ కీలక ఆదేశాలు

విశాఖపట్నం, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** :: భోగాపురం ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని మంత్రి నారాయణ అన్నారు. ఇందుకోసం రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని అన్నారు. ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో శుక్రవారం మంత్రి నారాయణ సమావేశం నిర్వహించారు. నగర అభివృద్ధి, మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ, ఇతర ట్రాఫిక్ సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్ల... ...రం

మిగతా 2 లో



### తెలంగాణ హైకోర్టులో...

## సునీత పిటిషన్

తన తండ్రి హత్య కేసు సీబీఐ కోర్టులో రోజువారీగా విచారణ జరిగేలా ఆదేశించాలని పిటిషన్

నాలుగేళ్లుగా కేసు విచారణ కొనసాగుతున్నప్పటికీ పురోగతి ఏమీ లేదని పిటిషన్‌లో పేర్కొన్న సునీత

విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసిన కోర్టు

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** :: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో ఆయన కూతురు సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో ఆమె సీబీఐని ప్రతివాదిగా చేర్చారు. సీబీఐ కోర్టులో తన తండ్రి హత్య కేసును రోజువారీగా విచారించేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు.

మిగతా 2 లో



# సంపాదకీయం

**యాంటీ ఇండియా**

**టెర్రరిస్టుల గుండెల్లో టెర్రర్**

ఎప్పుడు ఎవడొస్తాడో తెలియదు! ఎలా వేసేస్తాడో అర్థం కాదు! వారి చావు ఎంత ఘోరంగా ఉంటుందో.. అస్సలు ఊహించలేరు. వారి నేల మీదే.. క్షణాల్లో ఖతమైపోతున్నారు. టెర్రర్ ఎటాక్స్‌ని ప్లాన్ చేస్తున్న టెర్రరిస్టులందరి గుండెల్లో ఇప్పుడు టెర్రర్ మొదలైంది. పాకిస్థాన్ ఉగ్రవాదులకైతే.. కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఎక్కడున్నా.. ఎంత రహస్య ప్రదేశంలో దాక్కున్నా.. వారి చావు వారిని వెతుక్కుంటూ వచ్చేస్తోంది. ఒక్కొక్కరి ప్రాణాలు తీసేస్తోంది. గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వరుసగా హతమవుతున్నారు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు. మొన్నటికి మొన్న కుల్ భూషణ్ జాదవ్ కిడ్నాప్ వెనకున్న మతపెద్ద హతమయ్యాడు. ఇప్పుడు.. 26/11 ముంబై దాడుల ప్రధాన సూత్రధారి అయిన హఫీజ్ సయీద్ మేనల్లుడు.. అబూ కతల్ పాకిస్థాన్‌లోనే ఖతమయ్యాడు.కొన్నాళ్లుగా గుర్తుతెలియని వ్యక్తులు అనేకమంది భారత వ్యతిరేక శక్తులను ఖతం చేస్తున్నారు. లేటెస్ట్‌గా.. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా వ్యవస్థాపకుడైన హఫీజ్ సయీద్ మేనల్లుడు.. అబూ కతల్ హతమయ్యాడు. తన అనుచరులతో కాన్వాయ్‌లో వెళ్తుండగా.. ఒక్కసారిగా గుర్తు తెలియని వ్యక్తులు బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో అబూ కతల్‌తో పాటు అతని బాడీగార్డ్స్ కూడా చనిపోయారు. నిత్యం పాకిస్థాన్ ఐఎస్ఐ నీడలో సంచరించే అబు కతల్‌ని.. ఇలా లేపేయడం హాట్ టాపిక్‌గా మారింది. హఫీజ్ సయీద్, అబూ కతల్ హిట్ లిస్టులో ఉన్నారని ఐఎస్ఐకి తెలుసు. వాళ్లను.. పదేళ్లుగా జాగ్రత్తగా కాపాడుతూ వస్తుందనే సమాచారం ఉంది. అబూ కతల్‌కి ఐదు మారుపేర్లు ఉన్నాయి. హఫీజ్ సయీద్.. లష్కరే తోయిబాకి చీఫ్ అయినా.. తన మేనల్లుడైన అబూ కతల్‌ని చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా నియమించాడు. ప్లాన్ హఫీజ్ వేస్తే.. దానిని అమలు చేసేది అబు కతల్.లష్కరే తోయిబా ఉగ్రవాది అబూ కతల్.. ఇండియాలో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ఉన్నాడు. 2023లో రాజోరి జిల్లాలో జరిగిన ఉగ్ర దాడి, 2024 రియాసి జిల్లాలో జరిగిన బస్సు దాడిలో పాల్గొన్నాడు అబూ కతల్. ఇవి మాత్రమే కాదు జమ్మూకశ్మీర్‌లో అనేక దాడులకు ఇతనే బాధ్యుడు. అందువల్ల.. ఎన్ఐఏతో పాటు ఇండియన్ ఆర్మీ, ఇతర భద్రతా సంస్థల హిట్ లిస్టులో ఉన్నాడు. 2024 జూన్ 9న రియాసి జిల్లాలో.. శివకోరి గుహలో ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్న హిందూ యాత్రికుల బస్సుపై దాడి చేశారు.అబూ కతల్ నాయకత్వంలో జరిగిన ఈ దారుణమైన దాడిలో.. 9 మంది పౌరులు మరణించారు. 40 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఉగ్రదాడి తర్వాత రియాసి జిల్లాలో కొత్త భయాందోళన మొదలైంది. 2023 జనవరిలో రాజోరి జిల్లాలోని దంగ్రీ గ్రామంలో నలుగురు ఉగ్రవాదులు ప్రవేశించి.. పౌరులని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారు. ఈ ఉగ్రదాడిలోనూ అబూ కతల్ పాత్ర ఉంది. ఈ దాడిలో ఇద్దరు పిల్లలు సహా ఏడుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు.జమ్మూకశ్మీర్ సరిహద్దు గ్రామాల్లోని యువకులకు డబ్బు ఆశ చూపి.. లష్కరే తోయిబాలోకి రిక్రూట్ చేస్తున్నాడు అబు కతల్. అదొక్కటే కాదు.. మైనారిటీ సమాజానికి చెందిన పౌరులని, భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని ఎటాక్స్ చేయడంలో అబూ కతల్ పాత్ర ఉంటుంది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడం, బోర్డర్ దాటి చొరబడటం, పౌరులని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం, అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించడం లాంటివన్నీ.. అబూ కతల్ కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. వీటన్నింటిపై లోతైన దర్యాప్తు తర్వాత ఐదుగురు నిందితులపై ఎన్ఐఏ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. వీరిలో ముగ్గురు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా కమాండర్లు ఉన్నారు. అందులో.. అబూ కతల్, సైఫుల్లా అలియాస్ సాజిద్ జట్, మహమ్మద్ ఖాసిం ఉన్నారు.జమ్మూకశ్మీర్‌ని అస్థిరపరిచేందుకు దాడులు ప్లాన్ చేయడం, పాకిస్థాన్ నుంచి వచ్చే సూచనల్ని అమలు చేయడం లాంటివి చేయడంలో ఇతనిదే కీలకపాత్ర. అలాంటి.. అబూ కతల్ ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమవడంతో.. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరాటంలో.. ఓ ముఖ్యమైన పరిణామానికి నాంది పలుకుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయ్. పాకిస్థాన్ టెర్రరిస్టులకు, ఖలిస్థాన్ వేర్పాటువాదులందరికీ.. ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల భయం పట్టుకుంది. ఇదంతా.. కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. కొన్ని నెలలుగా నడుస్తున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఈ తరహాలో చాలా మంది హతమయ్యారు. ఇక ముందు కూడా ఇది కొనసాగుతుందనే సంకేతాలిస్తున్నారు.ఊరు లేదు.. పేరు లేదు.. స్ట్రాంగ్ ఎవిడెన్స్ లేదు. ఉగ్రవాదులను ఏరిపారేస్తున్న గుర్తు తెలియని వ్యక్తుల జాడ కూడా తెలియట్లేదు. ఎవరు చంపేస్తున్నారో అస్సలు అర్థం కావట్లేదు. ఇదంతా.. మూడు నాలుగేళ్లుగా జరుగుతున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఇలాంటి హత్యలు చాలానే జరిగాయ్. సిరీస్ ఆఫ్ ఈవెంట్స్‌ని చూశాక.. ఇప్పుడిప్పుడే అందరిలోనూ అనుమానం కలుగుతోంది. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులందరినీ.. ఒకరి తర్వాత ఒకరిని హతమారుస్తున్నారు గుర్తు తెలియని వ్యక్తులు.ముఖ్యంగా.. భారత్‌కు శత్రువులుగా ఉన్న వాళ్లు, ఇండియా హిట్ లిస్టులో ఉన్న వాళ్లంతా.. విదేశాల్లో హతమైపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇలా.. గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేస్తుండటంతో.. చాలా మంది ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని రహస్య ప్రదేశాల్లో దాక్కుంటున్నారు. . లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు, జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు అత్యంత సన్నిహితులైన వాళ్లు కూడా.. గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యారు. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న ఎందరో తీవ్రవాదులు, ఖలిస్థానీ ఉగ్రవాదులంతా ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్నారు. లష్కరే తోయిబాకు చెందిన అబ్దుల్ సలామ్ భుట్టావి, జియార్ రెహమాన్, అబూ ఖాసిం, ముఫ్తీ ఖైజర్ ఫరూక్, సర్దార్ హుస్సేన్ లాంటివాళ్లంతా.. పాకిస్థాన్ గడ్డ మీదే హత్యకు గురయ్యారు. ఇక.. జైషే మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు దావూద్ మాలిక్, షాహిద్ లతీఫ్, అతని సోదరుడు హారిస్ హాషిమ్, జహూర్ మిస్త్రీ కూడా పాక్ నేల మీదే ప్రాణాలు కోల్పోయారు.నిషేధిత ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జర్ కెనడాలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యాడు. అతనే కాదు.. ఖలిస్థాన్ ఉగ్రవాదులుగా పేరున్న సుఖ్దూల్ సింగ్, రిపుదామన్ సింగ్ కూడా కెనడాలోనే హత్యకు గురయ్యారు. అవతార్ సింగ్.. లండన్‌లో మర్డర్ అయ్యాడు. పరంజిత్ సింగ్, హర్వీందర్ సింగ్ సందూ.. లాహోర్‌లో గుర్తుతెలియని వారి చేతిలో చనిపోయారు. ఇక.. భారత్‌లో ఉగ్రదాడులకు పాల్పడిన బషీర్ అహ్మద్ పీర్, సయ్యద్ ఖలీద్ రజా, ఎజాజ్ అహ్మద్.. లాంటోళ్లంతా చనిపోయారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎఅ-814 హైజాకర్లలో ఒకరైన మిస్త్రీ జహూర్ ఇబ్రహీంని కూడా కరాచీలో కాల్చి చంపారు.2022 నుంచి ఇప్పటివరకు ఇదే తరహాలో.. చాలా మంది ఉగ్రవాదులు, భారత వ్యతిరేక శక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఓ వైపు ఈ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్ని కనిపెట్టేందుకు భారత ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. ఇదే సమయంలో ఉగ్రవాదులంతా హత్యకు గురవడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఉన్న అనుమానాలు, ఆరోపణల మేరకు పాకిస్థాన్ సైన్యం ఎంత రక్షణ కల్పించినా.. ఏ ఉగ్రవాది కూడా సేఫ్‌గా లేడనే విషయం అర్థమవుతోంది. ఇందుకు.. వరుసగా జరుగుతున్న ఉగ్రవాదుల ఏరివేత ఎపిసోడ్లే బిగ్ ఎగ్జాంపుల్. ఏదో ఒకరోజు వాళ్లంతా.. గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో బలైపోక తప్పదంటున్నారు. ఎంత సెక్యూరిటీ ఉన్నా.. వాళ్లంతా సురక్షితంగా లేరనే విషయం తెలుస్తోంది. ఎక్కడున్నా.. ఎలాంటి చోట దాక్కున్నా.. ఎంత సేఫ్‌గా ఉన్నామని అనుకున్నా.. ఏదో ఒక రోజు చావు వాళ్ల దాకా వెళ్తుందనే విషయం.. ఇప్పటికే అర్థమై ఉంటుందంటున్నారు.

## మంత్రి ఫరూఖ్‌కు...



మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అర్ధాంగి షహనాజ్ మరణించారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని సీఎం చంద్రబాబు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నానని, ఈ కష్ట సమయంలో గుండె నిబ్బరంతో ఉండాలని మంత్రి ఫరూఖ్ ను కోరుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీ న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అర్ధాంగి షహనాజ్ కన్నుమూశారని తెలిసి చింతించానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. జీవిత భాగస్వామి దూరమైన బాధను తట్టుకునే మనోధైర్యాన్ని ఫరూఖ్ గారికి ఇవ్వాలని దేవుడ్ని కోరుకుంటున్నానని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పవన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ గారి అర్ధాంగి షహనాజ్ గారు పవిత్ర రంజాన్ మాసంలో ఇంతిఖాల్ అయ్యారని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఆమెకు జన్నత్ లో ఉన్నతమైన స్థానం ప్రసాదించాలని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని అల్లాను ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఫరూఖ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని లోకేశ్ పేర్కొన్నారు.

## సంస్కారానికి ఆస్కార్ అవార్డు ఉంటే అది...

ప్రగల్బాలు. వ్యక్తిగత దూషణలతో మార్చురీ కంపు కొడుతున్నసీఎం హేయమైన ప్రసంగాలను వినలేక జనం ఛీ కొడుతున్నారు. చెవులకు చిల్లులు పడుతున్నాయి గానీ చేయూత పించన్లకు చిల్లి గవ్వ రాలడం లేదు అని హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి ఇదే అసెంబ్లీలో ఏమన్నారు అధ్యక్షా.. "రాష్ట్ర ముఖ్యమంత్రిగా చెబుతున్నాం ఒక్కనొక్కనితోడ్కలు తీస్త,బట్టలిప్పి రోడ్డు మీద తిప్పుత." అన్నడు. నిండు సభలో చైర్‌ను ఉద్దేశించి చెప్పగల ముఖ్యమంత్రి సంస్కారం ఎంత గొప్పది అధ్యక్షా? ఆస్కార్ అవార్డు ఇవ్వాలి. మీరు పెట్టగలిగే పూర్తి స్థాయి బడ్జెట్‌లు నాలుగే. అందులో రెండు బడ్జెట్ లు పూర్తయి పోయాయి. మిగిలినవి రెండే%ౌ% అంటే పుణ్యకాలం కాస్తా కరిగిపోతున్నది కానీ మీరు చూపించిన కలలు మాత్రం నిజమయ్యే దాఖలా కనిపించటం లేదు. మీ ప్రతికూల పాలసీలు, ప్రతీకార రాజకీయాలు రాష్ట్ర ఆర్థిక వృద్ధి మీద నెగిటివ్ ప్రభావాన్ని చూపుతున్నాయి. రాష్ట్ర ఆదాయ వనరులు ఒకటొకటిగా తగ్గుతున్నాయి. మేము పెంచుతూ వచ్చిన ఆదాయాన్ని మీరు తగ్గిస్తూ పోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం ముందు ముందు మరింత గడ్డు పరిస్థితిని ఎదుర్కోబోతున్నది. అరచేతిలో వైకుంఠం చూపించిన అభయహస్తం మ్యానిఫెస్టో ఇక శూన్య హస్తమేనని మీ రెండు వార్షిక బడ్జెట్ లు తేల్చేశాయని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలు సస్పెండ్..

### ఎత్తుకొని తరలించిన మార్షల్స్

బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీలో రచ్చ జరిగింది. ఈ నేపథ్యంలో సభకు అంతరాయం కలిగించిన 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలను ఆరు నెలల పాటు సస్పెండ్ చేశారు. వారు సభ నుంచి వెళ్లకపోవడంతో మార్షల్స్‌తో బలవంతంగా బయటకు పంపించారు. శుక్రవారం కర్ణాటక అసెంబ్లీని రెండు అంశాలు కుదిపేశాయి. కాంట్రాక్టు పనుల్లో ముస్లింలతో పాటు మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును సభలో ప్రవేశపెట్టారు. బీజేపీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించడంతో సభలో గందరగోళం చెలరేగింది. కాగా, తనపై హనీ ట్రాప్ జరిగిందని సహకార శాఖ మంత్రి కెఎన్ రాజన్న అసెంబ్లీలో ఆరోపించారు. కేంద్ర ప్రముఖులతో సహా 48 మంది వరకు రాజకీయ నేతలు హనీ ట్రాప్ బాధితులుగా ఉన్నారని అన్నారు. అయితే బ్లాక్‌మెయిల్, బలవంతపు వసూళ్లు జరుగుతున్నాయని బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిగా ఆరోపించారు. ఆధారాలు సూచించే సీడీలను చూపుతూ వెల్‌లోకి దూసుకెళ్లారు. వీటిపై దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ గందరగోళం మధ్యే ఆర్థిక బిల్లును అసెంబ్లీలో ఆమోదించారు. అయితే నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించినట్లుగా బీజేపీ ఎమ్మెల్యేలు పొరపాటుపడ్డారు. వెల్ వద్ద నిరసన చేస్తున్న వారు ఆ బిల్లు ప్రతులను చించివేశారు. స్పీకర్ యూటీ ఖాదర్ కుర్చీపైకి కాగితాలు విసిరేయడంతో సభలో గందరగోళం తలెత్తింది. కాగా, సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడంతో 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలను ఆరు నెలల పాటు అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారు. న్యాయ శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ ప్రవేశపెట్టిన ఈ బిల్లును సభ ఆమోదించింది. అయితే సస్పెండైన 18 మంది బీజేపీ సభ్యులు సభ నుంచి వెళ్లేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో మార్షల్స్ సహాయంతో వారిని బలవతంగా ఎత్తుకొని బయటకు తరలించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



## కడప జెడ్పీ పీఠంపై కూటమి.. ?

కడప, : వైయస్సార్ కాంగ్రెస్( పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి మరో సవాల్ ఎదుర్కొంటున్నారు. కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో జడ్పీ పీఠం నిలబెట్టుకోవడం ఇప్పుడు జగన్మోహన్ రెడ్డికి సవాల్ గా మారనుంది. జడ్పీ చైర్మన్ గా ఉన్న అమర్నాథ్ రెడ్డి రాజంపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో జడ్పీ చైర్మన్ ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లాలో కూటమి భారీ విజయం నమోదు చేసుకుంది. ఉమ్మడి కడప జిల్లాలో పులివెందుల, బద్వేలు, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గాల కు మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిమితం అయింది. ఈ తరుణంలో జిల్లా పరిషత్ చైర్మన్ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2021 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్తు స్థానాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుంది. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి అమర్నాథ్ రెడ్డికి వరించింది. 2024 ఎన్నికల్లో అమర్నాథ్ రెడ్డి రాజంపేట నియోజకవర్గం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. దీంతో అమర్నాథ్ రెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఇంకా 15 నెలలపాటు జిల్లా పరిషత్ కు గడువు ఉంది. ప్రస్తుతం వైస్ చైర్పర్సన్ గా ఉన్న శారద చైర్ పర్సన్ గా వ్యవహరిస్తూ వచ్చారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ్పీటిసి సభ్యులు ఐక్యంగా కనిపిస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా వారిని శిబిరాలకు తరలించే పనిలో పడింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే జడ్పీ చైర్మన్ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నేతలు వేరువేరు శిబిరాలుగా విడిపోయారు. ప్రధానంగా బ్రహ్మంగారిమఠం జడ్పీటిసి సభ్యుడు రామ గోవిందరెడ్డి అభ్యర్థిత్వం వైపు జగన్ మొగ్గు చూపినట్లు వార్తలు వస్తున్నాయి. కానీ ఆయన వైపు చాలామంది జడ్పిటిసిలు ఆసక్తి చూపడం లేదు. ఈ తరుణంలో చాలామంది జడ్పిటిసిలు కూటమి పార్టీల వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమయింది. తమ పార్టీ జడ్పిటిసి లను కాపాడుకునే పనిలో పడినట్లు తెలుస్తోంది. అవసరం అనుకుంటే భారీగా తాయిలాలు సైతం ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.ఉమ్మడి కడప జిల్లాలో50 మంది జడ్పిటిసి సభ్యులు ఉన్నారు. 2021 లో జరిగిన ఎన్నికల్లో 49 మంది సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. గోపవరం మండలం నుంచి మాత్రమే టిడిపి అభ్యర్థి అప్పట్లో విజయం సాధించారు. అయితే చాలామంది జడ్పిటిసిలు కూటమి పార్టీలకు అనుకూలంగా వ్యవహరించారు. కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో తిరుగుతున్నట్లు కూడా తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అనుమానం కూడా అదే. అయితే కడప జిల్లా పరిషత్తు చైర్మన్ పీఠాన్ని వదులుకుంటే మాత్రం రాజకీయంగా జగన్మోహన్ రెడ్డికి మరింత ఇబ్బందులకు గురిచేసే అంశమే. అందుకే జగన్ సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా మొత్తం 50 మంది సభ్యులకు గాను.. 47 మంది జడ్పీటీసీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో కూటమి పార్టీల వైపు జడ్పీటీసీలు వెళ్లిపోయారని. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యేలతోపాటు ఎంపీలు ఉండడంతో విజయం తమదేనని కూటమి భావిస్తోంది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ జడ్పిటిసి లను తీసుకుని క్యాంపు రాజకీయానికి బయలుదేరినట్లు సమాచారం. మరి కడప జిల్లా రాజకీయం ఎంతవరకు తీసుకెళ్తుందో చూడాలి.

## ప్రైవేటీకరణపై ఇంకా ఆందోళనే...

విశాఖపట్టణం : గత కొద్దిరోజులుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం కుదిపేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడంతో ప్రైవేటీకరణ నిలిచిపోయిందని అంతా భావిస్తున్నారు. అయితే కార్మికులతో పాటు ఉద్యోగుల్లో మాత్రం ఆందోళన కొనసాగుతోంది. ఇలా ప్యాకేజీ ఇచ్చే కంటే విశాఖ స్టీల్ కు సొంత గనులు కేటాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్లాంట్ తన కాళ్ళ మీద తాను నిలబడేలా చేయాలని కోరుతున్నారు. ఇప్పటికీ ప్రైవేటీకరణ ఆగలేదన్నది కార్మికుల అభిప్రాయం. ఈ విషయంలో కేంద్రం కూడా పూర్తి స్పష్టత ఇవ్వలేదు. తాజాగా మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. పాడి త్రినాథ్ అనే కార్మిక సంఘం నేత కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాశారు. ప్రైవేటీకరణ అంశంపై స్పష్టత కోరుతూ ఆయన ఈ లేఖ రాశారు. తమ నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని ఉక్కు మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చేసింది. దీంతో కార్మిక సంఘాలు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉద్యమించడానికి సిద్ధపడుతున్నాయి.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తెర పైకి వచ్చింది. అప్పట్లో జగన్మోహన్ రెడ్డి సర్కార్ ఈ ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోయిందని కార్మిక సంఘాలు ధ్వజమెత్తాయి. అదే సమయంలో తాము అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చంద్రబాబుతో పాటు పవన్ హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే విశాఖ ఉక్కు కు వేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించింది కేంద్రం. కానీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోయిందని విస్పష్ట ప్రకటన చేయలేదు కేంద్రం. దీంతో కార్మిక సంఘాల్లో ఒక రకమైన అనుమానం ఉంది. ఫాక్ట్ చెక్ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా కార్మిక సంఘం నేత లేఖ రాశారు. అయితే దానికి రిప్లై ఇచ్చే క్రమంలో ఉక్కు పరిరక్షణకు తమ వంతు కృషి ఉంటుందని చెప్పిందే కానీ.. ఇక్కడ కూడా స్పష్టత ఇవ్వలేదు. పైగా విశాఖ ఉక్కును కేంద్రం విక్రయిస్తుందనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొంది.గతంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై ఉద్యమాలు తీవ్రంగా సాగుతున్న సమయంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి రంగంలోకి దిగారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను సందర్శించారు. అనంతరం విశాఖ స్టీల్ ను ప్రైవేటీకరించబోమని తేల్చి చెప్పారు. అటు తరువాత పదివేల కోట్లకు పైగా నిధులను కూడా కేటాయించారు. దీంతో ఇక ప్రైవేటీకరణ అనేది ముందుకు సాగదని అంతా భావించారు. కానీ ఇప్పుడు విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశంపై పూర్తి స్పష్టతనివ్వడం లేదు కేంద్రం. నిలుపుదల చేస్తామని నేరుగా చెప్పడం లేదు. ప్రైవేటీకరణ ఆగదని సంకేతాలు ఇచ్చేలా చెప్పడంతో మరోసారి అనుమానాలు ప్రారంభమయ్యాయి.

## వేంకటేశ్వరస్వామి ఆస్తులు...

ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించానని, మానవ సేవ మాధవ సేవ రెండూ ఉంటాయని ప్రాణదానం తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించి కిందకు వస్తున్న సమయంలోనే తనపై 24 క్లేమోర్‌మైన్స్ పేల్చారని తెలిపారు. అన్ని క్లేమోర్స్ పేల్చినా తాను ప్రాణాలతో ఉన్నానంటే దానికి కారణం సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టడమేనని అన్నారు. ఎవరైనా సరే... 24 క్లేమోర్ మైన్స్ పేలితే ప్రాణాలతో తప్పించుకోలేరని, తాను కేవలం వేంకటేశ్వరస్వామి మహిమ వల్లే బతికానని చెప్పుకొచ్చారు.

**ఒక వడను చెరిసగం పంచుకుని తిన్న నారా భువనేశ్వరి, చంద్రబాబు...**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం ఇవాళ తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకుంది. నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా చంద్రబాబు, నారా భువనేశ్వరి, నారా లోకేశ్, బ్రాహ్మణి తిరుమలలోని అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అనంతరం వారు అన్న ప్రసాద కేంద్రంలోనే అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. పక్కపక్కనే కూర్చున్న చంద్రబాబు దంపతులు ఒక వడను చెరిసగం పంచుకుని తినడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఒక వడను తీసుకున్న భువనేశ్వరి సగానికి విరిచి ఒక సగం తాను తీసుకుని, మరో సగం చంద్రబాబుకు ఇచ్చారు. సోషల్ మీడియాలో ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. జీవితం చెరో సగం... ప్రమాణమేగా అనే సాంగ్ బ్యాక్ గ్రౌండ్ లో వస్తుండగా... పలు వీడియోలు నెట్టింట సందడి చేస్తున్నాయి. భార్యాభర్తలు ఎలా ఉండాలనేదానికి చంద్రబాబు, భువనేశ్వరి ఉదాహరణగా నిలిచారని నెటిజన్లు కొనియాడుతున్నారు.

## పోసానికి...ఊరట...

తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ న్యాయవాదుల ద్వారా సీఐడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కోర్టు తీర్పును వాయిదా వేసింది. కాగా, పోసానిని ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఏపీలో ఆయనపై 19 కేసులు నమోదైనట్టు తెలుస్తోంది. అవార్డులకు సంబంధించిన సినీ పరిశ్రమలో విద్వేషాలు రగిల్చే వ్యాఖ్యలు చేశారని... చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయనపై ఫిర్యాదులు అందడంతో కేసులు నమోదు చేశారు.

## తెలంగాణ హైకోర్టులో...

పిటిషన్‌పై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇప్పటికే దాదాపు నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతున్నప్పటికీ పురోగతి ఏమీ లేదని, సునీత ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో విచారణ సందర్భంగా సునీత తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 2019 మార్చి 14వ తేదీ అర్ధరాత్రి హత్య జరిగిందని, విచారణ జరిపిన సీబీఐ అధికారులు ఇప్పటికే రెండు ఛార్జ్‌షీట్లు దాఖలు చేశారని పేర్కొన్నారు. సీబీఐ కోర్టులో విచారణ కొనసాగుతోందని, దీనిని ఆరు నెలల్లో ముగించేలా కోర్టును ఆదేశించాలని కోరారు. సీబీఐ అధికారులు హార్డ్ డిస్కులను ప్రతివాదులకు ఇచ్చారని, అవి తెరుచుకోవడం లేదని, దీంతో పదిహేను నెలలుగా విచారణ ముందుకు సాగడం లేదని హైకోర్టుకు తెలిపారు. సునీత ప్రధానంగా సీబీఐ అధికారులతో పాటు తన తండ్రి హత్య కేసులో నిందితులుగా ఉన్నవారందరినీ ప్రతివాదులుగా చేర్చారు. ఈ అంశంపై విచారణ జరిపిన ప్రత్యేక ధర్మాసనం సీబీఐతో పాటు ఈ కేసులో నిందితులందరికీ నోటీసులు వ్యక్తిగతంగా ఇచ్చేందుకు సునీత న్యాయవాదికి అనుమతి ఇచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## కశ్మీర్‌లో ఇప్పుడు సాధారణ పరిస్థితులు...

నెలకొన్నాయని ఆయన తెలిపారు. రాజ్యసభలో ఆయన ప్రసంగిస్తూ, యువత ఉద్యోగాలు చేసుకుంటున్నారని, సినిమా హాళ్లు కూడా నిండుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వాలు ఉగ్రవాదం పట్ల మెతకవైఖరిని అనుసరించాయని ఆయన ఆరోపించారు. జమ్ము కశ్మీర్, ఈశాన్య భారతంలోని ఉగ్రవాదం, తీవ్రవాదం దేశ వృద్ధికి ఆటంకాలని, వాటి వల్ల 92 వేల మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీయే పాలనలో కశ్మీర్‌లో ఉగ్రవాద మరణాలు 70 శాతం తగ్గాయని తెలిపారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా 'ఒకే రాజ్యాంగం – ఒకే జెండా' అనే రాజ్యాంగ నిర్మాతల కలను మోదీ ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. 2019 నుంచి 2024 వరకు అక్కడి యువతకు 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయన్నారు. యురి, పుల్వామా ఘటనలు జరిగిన కొద్ది రోజుల వ్యవధిలోనే మెరుపు దాడులు, వైమానిక దాడులతో ఎన్డీయే ప్రభుత్వం పాకిస్థాన్‌కు గట్టిగా బదులిచ్చిందని ఆయన అన్నారు. 2026 మార్చి 31 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయ భావజాలం మద్దతున్న ఉగ్రవాదం విస్తరించకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

## ప్రజల నుంచి అభిప్రాయం తీసుకుని...



వీఎంఆర్డీఏ పరిధి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష చేశామని అన్నారు. గతంలో స్వార్థం కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారని చెప్పారు. ఫైనల్ చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఆన్‌లైన్‌లో ఉంచుతామని మంత్రి నారాయణ అన్నారు. ప్రజల నుంచి అభిప్రాయం తీసుకుని మాస్టర్ ప్లాన్ నాలుగు నెలల్లో ఫైనల్ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. మాస్టర్ ప్లాన్ అంటే రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని చేయాలని చెప్పారు. కొన్ని చోట్ల రోడ్ల పరిధిని పెంచడంపై అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మెట్రో రైల్ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమేనని తెలిపారు. 8 క్రాస్ రోడ్ల దగ్గర ఫ్లై ఓవర్లు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ డబుల్ డెక్కర్ రోడ్లు ప్లాన్ చేసేలా ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారని అన్నారు. టీడీఆర్ బాండ్ల విషయం అందరికీ తెలుసునని చెప్పారు. టీడీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

**టౌన్ ప్లానింగ్‌పై చర్చ..**

టౌన్ ప్లానింగ్‌లో తీసుకువచ్చిన సంస్కరణల అమలు, మరిన్ని మార్పులపై మంత్రి నారాయణ చర్చించారు. భవన నిర్మాణాలకు అనుమతులను మరింత సులభతరం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశానికి మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యులత, క్రెడాయ్, నరెడ్కో, ఎల్టీపీ అసోసియేషన్ల ప్రతినిధులు హాజరయ్యారు. భవన నిర్మాణాలకు సెట్ బ్యాక్ నిబంధనలు సరళతరం చేసేలా చర్చించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఇటీవల తీసుకువచ్చిన సంస్కరణలను పగడ్బందీగా అమలు చేయడంపై మంత్రి నారాయణ పలు సూచనలు జారీ చేశారు.

## డాక్టర్ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల.....

## వార్షిక దినోత్సవ వేడుకలు



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 21: కుప్పం పట్టణంలోని డాక్టర్ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాథ్ రావు ఆధ్వర్యంలో వార్షిక దినోత్సవ వేడుకలను శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక రంగాలలో రాణించాలనుకునే వారికి పాలిటెక్నిక్ విద్య ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా ద్రావిడ కూడలిలోని కుప్పం పట్టణానికి చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పలు పరిశ్రమల ఉద్యోగులుగా ప్రాంగణ నియామకాలలో ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు అందజేస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన దిశా నిర్దేశం చేశారు. అనంతరం వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమానాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, బెండనకుప్పం బాబు, రాజారామ్, టిడిపి నాయకులు కదిరప్ప, ప్రమోద్, బాలాజీలతో పాటు కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ బెట్టింగ్ లో పాల్గొంటే చర్యలు

## డీఎస్పీ కుప్పం



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 21: నేటి నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా ఆన్లైన్ బెట్టింగ్ లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని కుప్పం డి.ఎస్.పి ఒక ప్రకటనలో హెచ్చరించారు. క్రికెట్ మ్యాచ్ కోసం ఎవరైనా బెట్టింగ్ నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు, యువత బెట్టింగ్ లో పాల్గొనకూడదని వివరించారు. అలా ఎవరైనా కుప్పం నియోజకవర్గ పరిధిలో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిఎస్పి ఆ ప్రకటనలో తెలిపారు.

## జడ్పీ నిధులతో ....

## త్రాగునీటి బోరు బావి మంజూరు




వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 21: వీకోట మండలం మధురం దొడ్డి గ్రామపంచాయతీ నడిపేపల్లి గ్రామంలో త్రాగునీటి సమస్య తలెత్తడంతో సమాచారము తెలుసుకున్న చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ జి శ్రీనివాసులు వెంటనే స్పందించి, సంబంధిత అధికారులకు సమాచారం తెలియపరిచి, నడిపేపల్లి గ్రామములో యుద్ధ ప్రాతిపదికన బోరు బావి ప్రారంభించడం అయినది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మరియు అతని తనయుడు అమరనాథ్ కలిసి భూమి పూజ చేసి బోరు బావి పని ప్రారంభించారు. నీరు పుష్కలంగా లభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్ రెడ్డి, వైస్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, కన్వీనర్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు అతావుల్లా, హరీష్ రెడ్డి ,మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్ వాడి పిల్లలకు ....

## నాణ్యమైన విద్య అందించాలి

కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 21: అంగన్వాడి ప్రీ స్కూల్ పిల్లలకునాణ్యమైన విద్యా బోధన అందించాలని ఇంచార్జ్ సిడి పిఓ మల్లీశ్వరి అన్నారు. సదుం జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్య కర్తలకు రెండ వ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్చార్జి సిడిపిఓ మాట్లాడుతూ నవజాత శిశు సంర క్షణ,పిల్లల ఆరోగ్యం మెరుగు పరచడానికి, తల్లిపాల ద్వారా ఇమ్యు నైజేషన్ వంటి వాటిపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పోషణ బీ-పడాయి బీ పై అంగన్వాడి కార్య కర్తలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గిరిష, నీలకంఠ,వైద్యాధికారిణి జానకి, శిఖామణి,శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కుప్పం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

## బార్ అససియేషన్ ప్రెసిడెంట్ గా కె.సి. చంద్రప్ప

కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 21: కుప్పం బార్ అసోసియేషన్ నూతన కార్య వర్గం ఎన్నిక మార్చి 21 శుక్రవారం రోజున కుప్పం కోర్టు ప్రాంగణంలో జరిగిన న్యాయ వాదుల సమావేశంలో నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు.బార్ అససియేషన్ ప్రెసిడెంట్ గా కె.సి.చంద్రప్ప,జనరల్ సెక్రటరీ గా కొత్తపల్లి ఉదయ కుమార్,వైస్ ప్రెసిడెంట్ వి.వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ బి.ఆర్.అమర్నాథ్, కోశాధికారిగా ఎస్.మురుగన్ జాయింట్ కోశాధికారిగా ఎం.సుధాకర్,లేడీ సెక్రటరీగా వి.ఎస్. శైలశ్రీ, స్పోర్ట్స్ సెక్రటరీగా ఆర్.అనిల్ కుమార్, లైబ్రేరియన్ గా జి.పుష్పలత, తది తరులు ఏకగ్రీవంగా ఎన్నికైనరు. నూతన కార్యవర్గ సభ్యులుబార్ అసో సియేషన్ సభ్యుల అభివృద్ధికి, న్యాయ వాదుల హౌసింగ్ కాలనీ కి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశం లో కుప్పం కోర్టు శిథిలావస్థలో ఉన్న కారణంగా నూతన భవన నిర్మాణ పనులు పర్యవేక్షణకు గాను నూతన కమిటీ ఏర్పాటు చేసి కమిటీ చైర్మన్ గా బి ఆర్. అమర్నాథ్ ని వైస్ చైర్మన్ గా వి.ఎస్. శ్రీకాంత్ తదితరులను ఏకగ్రవంగా ఎన్నుకో వడం జరిగింది. ఏకగ్రీవంగా ఎన్నికైనందున కుప్పం న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు.



## కడా పీడీ వికాస్ మరమత్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదరం క్యాంప్





కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 21: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్ర, శనివారాల్లో కుప్పం ఏరియా ఆస్పత్రిలో దివ్యాంగుల కొరకు ప్రత్యేక సదరం క్యాంప్ కడా పీడీ వికాస్ మరమత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. శుక్రవారం రోజు గుడుపల్లె, రామకుప్పం,శాంతిపురం మండలాలకు చెందిన దివ్యాంగులందరూ కూడా పెద్ద ఎత్తున సదరం సర్టిఫికెట్ల కోసం పరీక్ష నిర్వహించడం జరిగింది. ఇందులో శుక్రవారం రోజు మార్చి 21న 2267 మంది హాజరు కాగా అందులో 1407 మంది సదరం సర్టిఫికెట్ ను నమోదు చేసుకు న్నారు. శనివారం రోజు న కుప్పం మండలం మరియు మున్సిపాలిటీకి సంబంధించిన దివ్యాంగులు ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గుడిపల్లి, శాంతిపురం,రామకుప్పం తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# మాలల సింహ గర్జన అనుమతి రద్దు సరికాదు

## కులగణన ప్రకారం సమన్యాయం చేయాలి

## అసెంబ్లీలో గొంతు విప్పకపోతే ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తాం

## మాలల జేఏసీ నాయకుల స్పష్టీకరణ

శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 21: శ్రీకాళహస్తి రాయలసీమ మాలల సింహ గర్జన అనుమతి రద్దు చేయడం సరికాదని మాలల జేఏసీ నాయకులు అన్నారు. కులగణన ప్రకారం సమన్యాయం చేయకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. విభజన పేరుతో మాలలకు జరిగిన అన్యాయంపై అసెంబ్లీలో గొంతు విప్పకపోతే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మాలల జేఏసీ, జై భీమ్ ఆర్మీ నాయకులు పులి శ్రీకాంత్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నింటికీ సభలు నిర్వహించుకోవడానికి ఇస్తున్న అనుమతిని హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న మాలల సింహ గర్జనకు మాత్రం ఎందుకు రద్దు చేశారని నిలదీశారు. విభజనకు సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలుగు రాష్ట్రాల్లోనే ఎందుకు హుటాహుటిన అమలు చేయడానికి కారణంపై ప్రశ్నించారు. విభజన అభ్యంతరాలను కేంద్రంలోని పలువురు మంత్రులు, ఎంపీలు కూడా లేవనెత్తిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణాలో ఎస్సీ వర్గీకరణలో సమన్యాయం పాటించారని తెలిపారు. అయితే



ఆంధ్రరాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారని చెప్పారు. కులగణన చేసిన తర్వాతే వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన వాటాలు కల్పించాలన్నారు. హక్కులను హరించే క్రిమిలేయర్ ను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. స్వాతంత్రం సిద్ధించి 76 సంవత్సరాలు అయినా మాలల పట్ల ఇప్పటికీ వివక్షత కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింహ గర్జనకు తొలుత ఇచ్చిన మేరకు సభ నిర్వహణకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాలల విషయంలో సాగుతున్న రాష్ట్రంలోని ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీలో తమ గొంతును వినిపించకపోతే ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాలల జేఏసీ నాయకులు అల్లం మణి, బీఎస్ఎన్ఎల్ నాగరాజు, చారులత, పోతుల చంద్ర, రాజేంద్ర, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేస్తే

# చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్న పలమనేరు డివిజనల్ విద్యుత్ శాఖఅధికారి ఏ డి ఈ చిన్నబ్బ

పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 21: పలమనేరులో గత రెండురోజులుగా సామాజిక మాధ్యమాలలో ట్రాన్స్ఫార్మర్ల కొరకు వినియోగదారులను విద్యుత్ అధి కారులు తిప్పిస్తున్నారని ఆరోపణలు చేయ డం మా దృష్టికి వచ్చింది. ఘటనపై వెంటనే స్పందించడం జరిగింది, వారికి ట్రాన్స్ఫార్మ ర్, మెటీరియల్ ఇవ్వడం జరుగుతుంది. ముఖ్యంగా విద్యుత్ వినియోగ దారులు గమనించాల్సిన విషయం ఏంటంటే, ఏదై నా సమస్యలు ఉంటే నేరుగా అధికారుల ను క్షేత్రస్థాయిలో కలిసి సమస్యను పరిష్క రించు కోవాలి అంతేగాని సామాజికమాధ్య మాల్లో దుష్ప్ర చారం చేయడం తగదు. నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని తెలి యజేస్తున్నా ము.ముఖ్యంగా కొంతమంది దళారులను నమ్మి ఇబ్బందులు పాలవుతు న్నారు. మీ సమస్యలు ఉంటే నేరుగా అధి కారులను కలిసి పరిష్కరించు కోవాల్సింది గా తెలియజేశారు.



## ముఖ్యమంత్రిని వీడ్కోలు పలికిన......

## మాజీ ఎమ్మెల్యే ఎస్ .సి .వి నాయుడు



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి21: శ్రీకాళహస్తి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్ లకు సాధారంగా శుక్రవారం వీడ్కోలు మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి



నారా చంద్రబాబు నాయుడు మనవడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తనయుడు దేవర్ష పుట్టినరోజు సంద ర్భంగా గురువారం రాత్రి తిరుమలకు విచ్చేశారు. శుక్రవారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆధ్వర్యంలో మనవడు పుట్టి నరోజు వేడుకలు ఘనంగా జరుపుకు న్నారు. అనంతరం తిరుమల దర్శ నార్థమై విచ్చేసి తిరిగి విజయవాడకు వెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లకు తిరుపతి విమానాశ్రయం లో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు సాధారంగా వీడ్కోలు పలికారు.

## అప్పలాయగుంట కాలువ కబ్జా

## హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయండి



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 21: శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆధ్వర్యంలో కబ్జాలకు కళ్లెం. శ్రీకాళహస్తి పట్టణంలోని బంగారమ్మ గుడి సమీపంలో నాగాలమ్మ పుట్ట వెనకాల ఉన్న అప్పలయగుంట సర్వే నంబర్ లెక్క దాఖలలోని 58/2 కాలువ స్థలాన్ని కబ్జా చేశారని విషయం తెలుసుకున్న ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోటేశ్వర బాబు కబ్జాలకు కళ్లెం వేసేందుకు సహచర పాత్రికేయులతో సంఘటన స్థలానికి చేరుకుని కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి వెంటనే తండ్రికి తగ్గ తనయుడు యువకుడు ఉత్సాహవంతుడు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్ళారు.స్పందించిన ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ప్రభుత్వ భూములు కబ్జాలకు తావు లేకుండా పాలన కొనసాగిస్తామాన్నారు. సంబధిత అధికారులకు కబ్జాకు గురైన కాలువ స్థలంలో హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తాసిల్దార్ లక్ష్మీనారాయణ స్పందించి వెంటనే వారి సిబ్బందిని పంపి సర్వే చేసి హెచ్చరిక బోర్డు పెడతామని, ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తాసిల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సంఘ సేవకులు పేదల పాలిట పెన్నిధి డాక్టర్ కోటేశ్వర బాబు మాట్లాడుతూ ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాలనలో కబ్జాదారులకు చోటు ఉండనీయమని ప్రెస్ క్లబ్ మిత్రుల సహకారంతో కబ్జాలను అడ్డుకుంటామని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలు

## సామర్థ్యాభివృద్ధిని పెంచుకోవాలని ......

## ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి

పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 21: అన్నమయ్య జిల్లా పీలేరు అంగన్వాడీల్లో విద్యా నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలస్థాయి అంగన్వాడి కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషణ్ భీ పఢాయి భీ రెండ వ రోజు శిక్షణ కార్యక్రమాన్ని పిడి ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమెమాట్లా డుతూ అంగన్వాడీ కేంద్రాలను సుశిక్షితు లైన కార్యకర్తలతో అభ్యాస కేంద్రాలుగా మార్చడానికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని అన్నారు. పిల్లల్లో భౌతిక,మేధో,ప్రారంభ భాష, సామా జిక భావోద్వేగం,సాంస్కృతిక సౌకర్యాభి వృద్ధి,అక్షరాస్యత,సంఖ్యాశాస్త్రం మెరుగు పరచడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ రాజమ్మ,సూపర్వైజర్లు స్వరూప, స్వర్ణ,అక్కయ్య, ఉమ అంగన్వాడీ కార్య కర్తలు పాల్గొన్నారు.



# మామిడి రైతులను ఆదుకోండి

## మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయండి- మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి..

## మామిడి పల్ప్ సుంకాన్ని తగ్గించే విషయమై విదేశాలతో సంప్రదింపులు జరపండి.

## మామిడి గుజ్జు ఎగుమతికి అవకాశాన్ని కల్పించండి... – లోక్ సభలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు (ఢిల్లీ),చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 21: ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రం గా నష్టపోతున్న మామిడి రైతులను ఆదుకో వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు. మామిడి రైతుల సంక్షేమాన్ని దృష్టి లో ఉంచుకొని మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలని విన్నవించారు. అదే సమయం లో ఇతర దేశాలకు ఎగుమతి చేసే మామిడి పల్ప్కు సుంకాన్ని తగ్గించి, విదేశా లకు మామిడి గుజ్జును ఎగుమతి చేసే అవ కాశాన్ని కల్పించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. 2025 -26 సంవత్సరానికి సంబంధించి,ఢిల్లీ పార్ల మెంటులో జరుగుతున్న ఆర్థిక బడ్జెట్ సమావేశాలకు హాజరైన ఆయన.., బడ్జెట్ చర్చ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగించా రు. జై జవాన్ జై కిసాన్ అనే నినాదంతో ఎన్డీఏ సర్కార్ పనిచేస్తోందన్నారు. ఆర్థిక బడ్జెట్లో ముఖ్యంగా వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత అన్నదాతల పట్ల ప్రధాని నరేంద్ర మోదీ.., ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని చిత్తూరు ఎంపీ తెలిపా రు. గతం కంటే భిన్నంగా.., 3.89శాతాన్ని పెంచి, రైతు ల సంక్షేమానికి పెద్దపీట వేయ డంతో పాటు, ఆధునిక సమాజానికి అను గుణంగా వ్యవసాయ సంస్కరణలు తీసు కొచ్చి, దేశంలో వ్యవసాయరం గాన్ని మరింత పులోపేతం చేయడమే తమ ప్రథమ కర్తవ్యమనీ ఎన్డీఏ ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా నిరూపిం చిందన్నారు. సమా జానికి రైతే మూల స్థంభమనీ తలచిన కేంద్ర ప్రభుత్వం.., 2019లో ప్రారంభించిన పియం–కిసాన్ పథకం ద్వారా 43.46 లక్ష ల కోట్ల రూపాయలను.. 18 విడతలలో దేశ వ్యాప్తంగా ఉన్న 11 కోట్ల మంది రైతులకు అందించిందని ఆయన గుర్తు చేశారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణ పరిమితిని మూడు లక్షల నుంచి ఐదు లక్షల వరకు పెంచిన ఘనత ఎన్డీఏ సర్కార్ దేనన్నారాయన. మామిడి పంటకు ఆంధ్రప్రదేశ్ ప్రసిద్ధి అని చెప్పిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.. 3.7 లక్షల హెక్టార్ల లో మామిడి విస్తరించి ఉందన్నారు.కృష్ణా, చిత్తూరు, గోదావరి జిల్లాలు మామిడి పంట కు ప్రసిద్ధిగాంచినవని తెలిపారు. మరీ ముఖ్యంగా చిత్తూరు పార్ల మెంటు పరిధి లో తోతాపురి ప్రధాన పంట అని పేర్కొన్న ఎంపీ దగ్గు మళ్ళ,.., దీని ద్వారా ఉత్పత్తి అయ్యే పల్ప్ ఉక్రెయిన్ దేశానికి ఎగుమతి అయ్యేదనీ..,అయితే రష్యా – ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కార ణంగా.. ఫల్ప్ ఎగుమతి ఆగిందన్న విష యాన్ని ఆయన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇక యూరోపియన్ దేశాలు ఆఫ్రికన్ దేశాల కంటే పల్ప్ దిగుమతి సుంకాన్ని పెంచడంతో భారత దేశం నుంచి మామిడి పల్ప్ ను విదేశాలకు ఎగుమతి చేయడం తలకు మించిన భారంగా మారిం దన్నారు. ఈ



నేపథ్యం లో కేంద్ర వ్యవసా య శాఖ ఈ అంశా న్ని పరిగణలోకి తీసు కొని.., చిత్తూరు పార్లమెంటులో ఉత్పత్తి అవుతున్న మామిడిపల్ప్ ను విదేశాలకు ఎగు మతి చేసే విషయాన్ని యూరోపియన్ దేశాలతో చర్చించి, సుంకాన్ని ఆఫ్రికన్ దేశాలతో సమానంగా తగ్గించే వెసులు బాటు మామిడి రైతులకు కల్పించాలని ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి విన్నవిచ్చారు. అంతేకాకుండా ప్రకృతి వైపరీత్యాలు మామిడి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయని, ఈ విషయాన్ని ,ఎన్డీఏ సర్కార్ గుర్తించి, గిట్టుబాటు ధరను కల్పించి అన్నదాతలకు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


## పది నెలలైనా ఇంతేనా...

### తమ్ముళ్లలో పెరుగుతున్న అసహనం

గుంటూరు : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటుతుంది. అయితే ఇప్పటికే క్యాడర్ లో ఒకరకమైన అహసనం కనపడుతుంది. తమకు ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కించడమేంటని క్యాడర్ సూటిగానే ప్రశ్నిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలతో కొందరు కుమ్మక్కై వెనకాడుతున్నారని కూడా తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. తమపై గత ప్రభుత్వంలో తప్పుడు కేసులు నమోదు చేసిన వారిపై ఇప్పటి వరకూ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సోషల్ మీడియా వేదికగా తెలుగు తమ్ముళ్లు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. అయితే చట్ట ప్రకారమే చర్యలకు దిగుతామని చంద్రబాబు పదే పదే చెబుతున్నా తమ్ముళ్లు మాత్రం తొందరపడుతున్నారన్న టాక్ వినపడుతుంది. ఇదిలా ఉండగానే ఎమ్మెల్యేలు కూడా అసహనం వ్యక్తం చేస్తుండటం పార్టీని ఇరకాటంలోకి నెట్టేసింది. తాజాగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ వేదికగా చేసిన కామెంట్స్ పార్టీలో కాక రేపుతున్నాయి. యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యలను పార్టీ అగ్ర నాయకత్వం సీరియస్ గా తీసుకుంది. ఏదైనా ఉంటే ఇటువంటి విషయాలు అంతర్గతంగా మాట్లాడాలి తప్పించి ఇలా అసెంబ్లీలో మాట్లాడటేమేంటని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అసెంబ్లీలో యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యామన్న ఆనందం లేదని, తమ పనులు ఒక్కటి కూడా జరగడం లేదని, ఎందుకు ఎన్నికయ్యామో కూడా అర్థం కావడం లేదని వెంకట్రావు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. యార్లగడ్డ వెంకట్రావు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా జిల్లా డీసీసీబీ బ్యాంకు ఛైర్మన్ గా పనిచేశారు. ఆ సమయంలో అనేక సంస్కరణలను చేపట్టారు. అయితే ఆయన తర్వాత వైసీపీకి రాజీనామా చేసి యార్లగడ్డ వెంకట్రావు టీడీపీలో చేరిపోయారు. వెంకట్రావు రాజీనామా చేసిన తర్వాత బ్యాంకులో అనేక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. పెద్దయెత్తున అవినీతి జరిగిందని యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి రావడంతో వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. కానీ కొన్ని నెలలు గడుస్తున్నా అధికారులు డీసీసీబీలో జరిగిన అవకతవకలపై విచారణ జరపకపోవడంపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ఉన్నతాధికారుల తప్పిదమా? లేక అగ్రనేతల నిర్లక్ష్యమా? అన్నది తేలకుండా ఉంది. .. ఇది ఒక యార్లగడ్డ వెంకట్రావు మాత్రమే కాదు టీడీపీలో ఉండి గత ప్రభుత్వంలో కేసులు నమోదు చేయించుకుని, జైలుకు వెళ్లి వచ్చిన వారు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. చట్టం పేరుతో కాలయాపన చేస్తూ పోతుంటే క్యాడర్ లో తాము పలచన అవ్వక తప్పదని వారు చెబుతున్నారు. రాయలసీమలోని కొందరు ఎమ్మెల్యేలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మరికొందరు ఎమ్మెల్యేలు కూడా మంత్రుల వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. అయితే తొందరపడవద్దని వరసగా వేధించిన వైసీపీ నేతలపై కేసులు నమోదు చేస్తామని బుజ్జగించి పంపుతున్నారు. దీంతో టీడీపీలో ఇటు క్యాడర్ తో పాటు అటు ఎమ్మెల్యేలు కూడా పెల్లుబుకుతున్న ఆగ్రహంపై నీళ్లు చల్లాల్సిన అవసరం అధినాయకత్వంపై ఉంది.

## శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ....

### సంప్రోక్షణ కుంభాభిషేకం కార్యక్రమం





వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 21: చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం పెరుమాళ్ళపల్లి గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయం కుంబాభిషేకం 1986లో జరిగినది మరల ఈ సంవత్సరం జూన్ 4 5 6 తేదీలలో సంప్రోక్షణ కుంభాభిషేకం చేయాలని గ్రామస్తులందరూ ఏకీభవించి నిర్ణయించినారు. కావున గుడి మరమ్మత్తులు వేగంగా జరుగుతున్నాయి గ్రామంలో అందరి సహకారంతో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. పెరుమాళ్ళపల్లి ఇట్లు గుడి ధర్మకర్త కార్యనిర్వాహకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్వలాభం కోసమే కూటమి నాయకుల వేలంపాట

### మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి- పెనుమూరు మండలంలో జరిగిన వేలంపాటను

### రద్దుచేసి తిరిగి మళ్ళీ బహిరంగ వేలం నిర్వహించాలి – మాజీ డిప్యూటీ సీఎం డిమాండ్

ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 21: చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం పెద్ద తయ్యూరు గ్రామంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం కూని చేసి వేలం పాటలో పోలీసులను పెట్టి అడుగడుగున అడ్డంకులు సృష్టిస్తూ దానిపై జిల్లా కలెక్టర్ ఎస్పీ వెంటనే స్పందించాలని అన్నారు. నియోజకవర్గంలో పెనుమూరు మండలం కేంద్రంలో బస్టాండ్ వాణిజ్య కాంప్లెక్స్ గతంలో ఎందరో చిరు వ్యాపారులకు అండగా నిలిచిందని నేడు కూటమి ప్రభుత్వం స్వలాభాన్ని దృష్టిలో పెట్టుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రధాన కార్యదర్శి దయాసాగర్ రెడ్డి గతంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని కోర్టు చుట్టూ తిరిగి పదిమంది పేదవారికి మంచి చేయాలని ఉద్దేశంతో నూతన వాణిజ్య సదుపాయాన్ని నిర్మించి గా నేడు దీనిని రాజకీయంగా తీసుకొని గతంలో ఉన్న వారికి రూములు ఇవ్వకుండా వేలంపేట నిర్వహించగా వేలంపాటలో పాడడానికి వస్తున్న వారికి



అడుగడుగున కూటమి నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కూటమి నాయకులే కుమ్మక్కై కాంప్లెక్స్ రూములను పంచుకున్నారని జిల్లా కలెక్టర్ అధికారులు స్పందించి వేలంపాట ను రద్దుచేసి తిరిగి బహిరంగంగా వేలం వేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా కొత్తపల్లి మిట్ట వారపు సంత వేలం పాతం లో పాల్గొనే వారికి అడుగడుగున అడ్డం కాదు సృష్టిస్తూ 50 60 మంది పోలీసు నిఘాల తో వేలంపాట నిర్వహిస్తే అత్యధికంగా తొమ్మిది లక్షల 60 వేల రూపాయలతో పాడిన వ్యక్తి నేడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుడు కావడంతో కూటమి నాయకులు అన్ని రకాల ఇబ్బంది పడుతున్నారని వేలం పాడిన వ్యక్తికి ప్రభుత్వం అధికారులు అన్ని రకాల సహకరించాలని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గురువారెడ్డి, కొత్తపల్లి వైసిపి యువ నాయకుడు సాము యుగంధర్ రెడ్డి వైసీపీ నాయకులు జనార్ధన్ మనీ అశోక్ రెడ్డి దామోదర్ నాయుడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెతుకుతున్న నిఘా కళ్లు

విజయవాడ : ట్రాఫిక్ పోలీసులు లేరని లైట్ తీసుకున్నారు.. నిబంధనల్ని పట్టించుకోలేదు. కట్ చేస్తే ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే వాహనాలకు భారీగా చలానాలు కనిపించాయి. విజయవాడకు చెందిన ఆటో డ్రైవర్ ఒక రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా జంప్ చేశాడు. రెండు రోజుల తర్వాత ఈ–చలానా చెక్ చేస్తే రెడ్ సిగ్నల్ జంప్ చేసినందుకు రూ.వెయ్యి జరిమానా పడింది. మరో విద్యార్థి హెల్మెట్ లేకుండా ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి ఒకే బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేశారు. దీంతో ఈ బైక్‌కు రూ.2000 జరిమానా పడింది. పోలీసులు లేకుండా జరిమానాలు ఎలా సాధ్యమంటూ ఆరా తీస్తే అసలు సంగతి తెలిసింది.విజజయవాడలో ట్రాఫిక్ కూడళ్లపై పోలీసులు నిఘాను పెంచారు. మొన్నటి వరకు సిగ్నల్స్ దగ్గర వాహనదారులకు అవగాహన కల్పించిన పోలీసులు.. తాజాగా ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ/ ఐటీఎంఎస్ (ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ల ద్వారా నిఘా పెంచారు. ఐటీఎంఎస్ ద్వారా ఈ చలానాలను నమోదు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు లేరని గీత దాటితే జరిమానాలు పండుతున్నాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ఈ ఐటీఎంఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మార్చి 1 నుంచి అమల్లోకి రాగా.. ముందే అధికారులు ప్రకటనలు కూడా ఇచ్చారు. ఐటీఎంఎస్ విధానం ఉందని చాలామందికి తెలియలేదు.. దీంతో కెమెరాలకు అడ్డంగా దొరికిపోతున్నారు.విజయవాడలో ట్రాఫిక్ పెరిగిపోయింది.. పోలీసు సిబ్బంది కూడాసరిపడా లేరు. అయినా సరే మొన్నటి వరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. అయితే పోలీసులు లేనిచోట్ల కొందరు వాహనదారులు రెడ్ సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్లిపోతున్నారు. ఇలా వెళ్లడంతో మిగిలిన వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. నిబంధనల్ని పాటించనివారిని కట్టడి చేసేందుకుఐటీఎంఎస్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు ట్రాఫిక్ పోలీసులు. విజయవాడలోని ఆరు కూడళ్లలో ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేయగా.. మరో 10 చోట్ల కూడా తీసుకురావాలని భావిస్తున్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని.. చలనాలు కొని తెచ్చుకోవద్దంటున్నారు పోలీసులు.రెడ్ సిగ్నల్ పడిన తర్వాత వెళితే జరిమానా పడుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసులు లేరని ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వెళితే కెమెరాకు దొరికిపోతారంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు రెడ్ సిగ్నల్ జంప్, హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటోడ్రైవర్‌కు యూనిఫాం లేకపోవడం, వన్ వే నిబంధన ఉల్లంఘన, ఓవర్‌లోడ్ వంటి అంశాలను గమనిస్తున్నారు. మార్చి 6 నుంచి ఈ ఐటీఎంఎస్ చలానాల విధింపును అమలు చేస్తున్నారు. విజయవాడలో వారం రోజుల్లో 211 మంది ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించడంతో జరిమానా విదించారు. ఏ ఉల్లంఘనకైనా రూ.1000లు కట్టాల్సిందే.. ఒకవేళ ట్రాఫిక్ ఉల్లంఘన అత్యంత తీవ్రమైనదైతే.. కొత్త మోటారు వాహనాల చట్టం ప్రకారం రూ.10వేల వరకు జరిమానా విధించే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు పోలీసులు. వాహనదారులు ఈ విషయాలను గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సీఎం బాబు,మంత్రి లోకేష్ ను.....

### కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం





సత్యవేడు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 21: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి శ్రీ నారా లోకేష్ ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మర్యాద పూర్వకంగా కలిశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనవడు నారా దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకొని సీఎం శుక్రవారం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు పయనంలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు.అప్పటికే విమానాశ్రయంలో వేచి ఉన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కలుసుకొని అభివాదం చేస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు.

## జైలు పక్షిలా పోసాని...

# పాపం.. పట్టించుకొనేవారేరి

కడప : పోసాని కృష్ణమురళీ జైళ్లు పట్టుకు తిరుగుతున్నారు. ఒకచోట కస్టడీ అయిపోగానే మరోచోటకు వెళుతూ రాష్ట్రంలోని అన్ని జైళ్లను చుట్టేస్తున్నారు. సినిమా రంగంలో అత్యంత గౌరవ, మర్యాదలు అందుకున్న వ్యక్తికి ఇలా జరగాలని ఎవరూ కోరుకోరు.. కానీ ఆయన ప్రవర్తన, మాటలే ఆయన ప్రస్తుతం అనుభవిస్తున్న జీవితానికి కారణం అని అంతా అంటున్నారు. అయితే.. ఇదే పోసాని ఎవరి కోసం అయితే నోటికి వచ్చినట్లు మాట్లాడారో.. అదే నాయకుడు కనీసం పోసాని గురించి మాట్లాడడం లేదు. ఆయన్ను పలకరించేందుకు సైతం ప్రయత్నించలేదు. ఏ వైసీపీ కోసం అయితే కష్టపడ్డారో, ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారో.. అదే వైసీపీ పోసాని గురించి పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. మొదట్లో.. వైసీపీలోని కొంత మంది నేతలు.. ముఖ్యంగా పొన్నవోలు సుధాకర్ రెడ్డి ప్రయత్నాలు చేసారు. కానీ..ఇప్పుడు మాత్రం ఎవరూ స్పందించడం లేదు.కూటమి పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అందరికీ మాటలు హద్దులు దాటాయి. వాళ్ల స్థాయిని, స్థానాన్ని మరిచిపోయి? పార్టీల రొచ్చులో దొర్లారు. అలాంటి వారిలో పోసానికి కూడా పెద్ద గజమాలే వేయాలి అంటున్నారు కూటమి మద్దతుదారులు. పోసాని కంటే ముందు మరింత పెద్ద సత్కారం చేయాల్సి వస్తే.. బోరుగడ్డ అనిల్ కుమార్ అనే వ్యక్తికి చేయాల్సి ఉంటుంది. అతని నోటికి అయితే పచ్చి బూతులే వస్తుంటాయి. ఆయా వీడియోలు ఇప్పటికీ.. సోషల్ మీడియాలో అందుబాటులోనే ఉన్నాయి. కాగా.. అతని పరిస్థితీ పోసాని లాగానే రాష్ట్రంలోని జైళ్లకు రిమాండ్ మీద సందర్శించుకుని వస్తున్నాడు. వీరిద్దరి విషయంలో వైసీపీ డైరెక్టుగా సపోర్టు చేయకపోవడాన్ని చాలా మంది ప్రశ్నిస్తున్నారు.వాస్తవానికి వైసీపీ అధినేతకు ఓదార్పులు బాగా కలిసి వస్తాయంటున్నారు కూటమి నేతలు.. ఆయన తొలినాళ్ల నుంచి ఓదార్పులతోనే పార్టీని నెట్టుకు వస్తున్నారు. అలా.. టీడీపీ కేంద్ర కార్యాలయం మీద దాడి కేసులో అరెస్టు అయిన వల్లభనేని వంశీ, ఎలక్షన్ సమయంలో ఈవీఎం మెషిన్ పగులగొట్టిన కేసులో పిన్నెల్లి రామకృష్ణా రెడ్డితో సహా వివిధ కేసుల్లో జైలుకు వెళ్లిన నందిగం సురేష్ వంటి వారిని జగన్ స్వయంగా పలకరించారు. మిగతా వారికి వైసీపీ కేడర్, జిల్లా స్థాయి పార్టీ నాయకులు అండగా నిలుస్తున్నారు. కానీ.. పోసాని, బోరుగడ్డకు మాత్రం ఎవరూ మద్ధతు నిలవడం లేదు. అంటే.. ఎవరైనా దిగజారుడు మాటలు మాట్లాడితే.. వారిని అవసరాలకు వాడుకుంటారు కానీ, ఆపదలో ఆదుకోరు అనే విషయం వీరిని చూసైనా తెలుసుకోవాలంటున్నారు.పోసాని కృష్ణమురళి సినిమా పరిశ్రమలో గుర్తింపు స్థాయి రచయిత, నటుడిగానే ఉన్నారు. ఆయనను పట్టించుకోని వైసీపీ నాయకులు.. వివాదాస్పద సినిమాల దర్శకుడు రామ్ గోపాల్ వర్మ విషయంలో మాత్రం హడావిడి చేశారు. ఒంగోలు పోలీసు స్టేషన్ లో విచారణకు హాజరైన ఆర్జీవీ కి స్వాగతం పలికే దగ్గర నుంచి తిరిగి ఆయన్ను విచారణ అనంతరం విడిచిపెట్టే వరకు దగ్గరుండి వైసీపీ నాయకులు చూసుకున్నారు. అంత మాత్రం గౌరవం కూడా పోసానికి దక్కలేదు.అయితే.. స్టార్టింగ్ లో గట్టిగానే నిలబడిన పోసాని.. ఆ తర్వాత మాత్రం తన మాటల వెనుక అసలు కారణాల్ని వెల్లడించారు. తొలుత వైసీపీ సకల శాఖ మంత్రి సజ్జల రామాకృష్ణ రెడ్డి డైరెక్షన్ లోనే తాను మాటల్ని తూలానని ఒప్పుకున్నారు. ఆ తర్వాత వైసీపీకి చెందిన ఓ పత్రికకు సంబంధించిన వ్యక్తులు అందించిన స్క్రిప్ట్ కారణంగానే మాట్లాడాను అంటూ ఉన్నది ఉన్నట్లు చెప్పేసారు. దాంతో? వైసీపీ కార్నర్ కావాల్సిన పరిస్థితులు తలెత్తాయి. దాంతో.. అతనికి సపోర్టు చేసి మరీ ఇరుకున పడడం ఎందుకులే అనుకుని.. వైసీపీ క్యాడర్ సైలెంట్ అయ్యింది అంటున్నారు.

## ఏపీలో రెండు కొత్త రైల్వే లైన్లు

ఒంగోలు : ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైలు మార్గాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు కొనసాగుతున్నాయి. అలాగే ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కలగా మిగిలిన ఒంగోలు–దొనకొండ, మార్కాపురం –శ్రీశైలం రైలు మార్గాలను ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈ రైల్వే లైన్ల అంశాన్ని లోక్‌సభలో ప్రస్తావించారు. ఈ రైల్వే లైన్లను నిర్మించాలని కేంద్రాన్ని కోరడంతో పశ్చిమ ప్రాంత వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కేంద్రంలో కదలిక వచ్చి రైల్వేమంత్రి స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారుగతంలోనే ప్రకాశం జిల్లాకు సంబంధించి ఒంగోలు – దొనకొండ రైల్వేలైను నిర్మాణం అంచనాలు తయారుచేయాలని ఆదేశాలు వచ్చాయి. మార్కాపురం నుంచి శ్రీశైలంకు రద్దీ పెరగడంతో ఈ రైల్వేలైను ఉపయోగంగా ఉంటుందని భావించారు. ఈ రైల్వే లైన్ పూర్తి చేస్తే గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే మల్లన్న భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని చెబుతున్నారు.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036